# మధుపర్కం

**యామిజాల శంకరం**

ఉగ్రపురానికి, రుద్రపురానికి మధ్య అయిదారు మైళ్ళన్నా లేదు. ఆ రెండు గ్రామాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. అటు కాకి యిటు వాలటానికి వీల్లేదు. ఇటు దోమ అటు దూరటానికి వీల్లేదు.

ఉగ్రపురం నర్సిమయ్య కొడుకు రంగడికి, రుద్రపురం తాయారమ్మ కూతురు పార్వతి నిచ్చి వివాహం చేయడానికి నిశ్చయించుకోవడమైనది తాయారమ్మ పేరే ఎందుకు చెప్పానంటే...అలా చెప్పాల్సి వచ్చింది మరి. అన్నివిషయాల్లోను ఆవిడదే పెత్తనమంతాను. భర్త ఉన్నాడు చూచారు.. ఆయన...భార్య ఇట్లా చేయి, అట్లా చేయి అని ఆజ్ఞాపిస్తే అట్లా ఇట్లా చేసే రకం.

వివాహం అతివైభవంగా జరుగుతున్నది. రుద్రపురం యింద్రపురంలా తయారయింది. రెండు గొప్పిళ్ళలో పెండ్లి జరుగుతున్నదంటె...రెండు గ్రామాలు ఒక కడ కొచ్చాయంటే అతిశయోక్తి ఏముంది?

అయితే పేచీ లేని పెండ్లి కందం లేదు. విందుల దగ్గరో, వినోదాల దగ్గరో, కట్నాలు, కానుకలదగ్గరో...ఎక్కడయితేనేం రానే వచ్చింది పేచీ. వీరావేశంతో వియ్యాలవారు విరగబడిపోయారు. రెండూ సమవుజ్జీలు. మాటామాటా పెరిగింది. "నువ్వెంత?"—అంటే "నువ్వెంత?"—వరకు దిగింది. శిగలు పట్టుకు నేంతవరకు దిగజారిపోయారు.

నర్సిమయ్య తాయారమ్మ గద్దరితనంతో పోటీ చేశాడు:—"అసలు నీ విషయం నాకు తెలియదు కనుకనా? నీతో ఆ భగవంతుడు కూడా గెలువలేడు......మహాంకాళివి...భద్రకాళివి..."

తాయారమ్మ కస్సుమంది:—"మధ్య వచ్చిన సిరి మానవుణ్ణి వానరుణ్ణి చేస్తుందట. అసలు నీ సంబంధం వప్పుకోవడ మేమిటి? కుంపేడుగు మెతుకులు తినే రకం. "వద్దయ్యా!" అంటే యీయన విని చచ్చాడు కనుకనా?" అంటూ అకారణంగా భర్తమీద విరుచుకొని పడింది.

రానురాను నర్సిమయ్య ఉగ్రనృశింహుడయ్యాడు. తాయారమ్మ రుద్రరూపం ధరించింది పెండ్లికి వచ్చిన పెద్దలంతా విస్తుపోయి విరగబడి చూస్తున్నారు.

"మావాడి కసలు పెండ్లే కాలేదనుకుంటాను. లేవరా పీటలమీదనుంచి..." తీవ్రమైన కోపంతో నర్సిమయ్య అనేశాడు.

"మా పిల్లకు కాలేదని మేమూ అనుకుంటాం. తెంచెయ్యవే - ఆ పుస్తెలు"—ప్రళయతాండవం చేసింది తాయారమ్మ.

## 2

కొన్నాళ్లు గడిచిపోయాయి. తాయారమ్మ దిగిరావాలని నర్సిమయ్య ఉద్దేశ్యం. కూతురుకోసం తాయారమ్మ తన కాళ్లమీద పడుతుందని ఊహించాడు. ఆవిడ గర్వభంగం చేయడంకోసం, ఆవిడను లొంగదీసుకోవడం కోసం అనేక మార్గాలు అన్వేషించాడు. అలా జరుగలేదు. ఆఖరుకు కుమారునికి మరో పెండ్లి చేయటానికి నిశ్చయించుకున్నట్లు చిన్న డప్పు వాయించాడు.



## ★ మధుపర్కం ★

ఈ వార్త తాయారమ్మ చెవుల కెగబ్రాకింది. క్రోధ తొక్కిన త్రాచులా రెచ్చిపోయింది. "నీతి జాతిలేనివాళ్లు!..." హుంకరించింది. "అయిందేదో అయిపోయింది. పొరబాటు. అస లేమీ కాలేదు. నా కూతురును పెండ్లిచేయటానికి నేను నిశ్చయించుకున్నాను. రెండూ ఒకేసారి జరగాలి. యాభై వేలిస్తాను. దమ్మున్న వెధవ ఎవరైనా ఉంటే ముందుకురావాలి..."— ఢంకా బజాయించింది.

"తప్పమ్మా...అలా అనకు. నన్ను! చంపించివెయ్యి." అంటూ కూతురు కాళ్ల మీద పడింది. "ఛీ!..." అంటూ కూతుర్ని ఎడమకాలితో ఒక్కతోపు తోసింది.

ఈ వార్తవిని నర్సిమయ్య భగ్గుమన్నాడు. తన చేనుమీదనుంచి తాయారమ్మ పొలానికి నీరుపోకుండా బందుచేయించాడు. తాయారమ్మ పొలం బీడుపడినా ఆవిడ చలించలేదు. అంతమాత్రంచేత ఆవిడ నష్టపడక పోనూలేదు.

మనస్పర్ధలు పెరిగిపోయాయి. రోషాలు రేగిపోయాయి. ప్రతిజ్ఞలు విజృంభించాయి. మీసాలు మెలేశారు. అయితే తాయారమ్మకు మీసంలేని లోపం ఏమీలేదు.

నర్సిమయ్య వరి చక్కగా పండింది. తాయరమ్మ పంటపోయినందుకు చంకలు కొట్టి రంకెలు వేశాడు. అదృష్టం కలిసి వచ్చి తన వరి విపరీతంగా పండింది. పోగాలపు పంట ఎప్పుడూ అలానే పండుతుంది. కోయించి కుప్పవేయించాడు. వచ్చే వెన్నెలరోజుల్లో కళ్లం వేద్దామనుకుంటున్నాడు. కాని ఒకరాత్రికి రాత్రి కుప్ప భగ్గున మండి బూడిదై కూర్చుంది. లబో, దిబో, అన్నారంతాను.

తాయారమ్మ యీ మధ్యనే రెండు మైసూరెడ్లను బండికోసం కొన్నది. అవి దొడ్లోని దొడ్లో మాయమయ్యాయి.

ఈ ప్రళయ పరిణామాలమధ్య ఉగ్రపురం, రుద్రపురం అట్టుడికినట్టు ఉడికిపోతున్నాయి. ఊరుము ఉరిమి ఎవడిమీద పడుతుందో పిడుగు; ఏ క్షణంలో ఏం జరుగుతుందో ఏమీ చెప్పలేకుండా ఉన్నారు. ప్రాణాలు గుప్పిట్లో పట్టుకుని కూర్చున్నారంతాను.


# నాలుగు ఔషధములు ఒకట్లో




అనాసిన్, త్వరితముగా బాధలనుండి నివారణ ఇచ్చునట్టి, ఒక విజ్ఞాన సూత్రం. ఎందుకనగా అది క్రింది ఔషధముల కలియతచేత :-

1 క్వినైన్: అధిక శక్తి నిచ్చు ఔషధమని మరియు జ్వరనివారణియని ప్రఖ్యాతిగాంచిన ఔషధ సమ్మేళనం. జ్వరాన్ని తగ్గించడంలో పాలిచేసిని.

2 కఫీన్: బలహీనానికి మరియు చిక్కిపోయినందులకు తగిన ఔషధమని విరివిగా వాడబడుచున్నది.

3 ఫినాసిటిన్: తీవ్రమైన బాధా నివారణి మరియు జ్వర నివారణియని ఖ్యాతిచెందినది.

4 అసిటైల్ సాలిసిలిక్ ఆసిడ్: ఇది తలనొప్పి, మరియు అలాంటి వివిధ బాధలను పోగొట్టుటకు ఉపయోగబడుచున్నది.

వైద్యశాస్త్ర రీత్యా లేక సమ్మేళన శక్తిచేత అనాసిన్ సూత్రం, త్వరితంగాను, నిరపాయంగాను, దృఢంగాను, బాధలనుండి, తలనొప్పి, జలుబు జ్వరం, దంతపు పోట్లు, కండరముల పోట్లు, వాయువు నొప్పులు మొదలగుబాధలను నివారించును.

8 మాత్రలుగల పాకెట్లలోను, మరియు 32 మాత్రలుగల అల్యూమినియం డబ్బాలలోను దొరుకును.

ఎల్లప్పుడును **అనాసిన్** బిళ్ళలే కావలెననికోరండి

వీరయ్య నర్సిమయ్య యింట్లో ఆనాదిగా ఉంటున్న నౌకరు. అతని కెవరూ లేరు. అందుకని నర్సిమయ్య యింట్లోనే ఉంటున్నాడు. నర్సిమయ్య కతడు కుడి భుజం, నమ్మకస్తుడు. అతడు తల పగిలి రక్తం వలవల కారుతూ యింటికి వచ్చాడు. తాయారమ్మ నౌకర్లు విరచికట్టి అదర కొట్టారట.

అయితే తాయారమ్మ పాలేరు శీతాయిగాడి తల గీసుకొని పోయి రక్తపు బొట్లు కారాయట. ఎట్లా కారాయో ఏమో మరి! విషయం అవగాహన కావటం చాలా కష్టం.

ఆ రెండుఊళ్లకు ఒకే పోలీసుస్టేషను... ఒకే హాస్పిటలు. ఆ రెండూ దురదపాడులో ఉన్నాయి. దురదపాడు కొత్త పెద్దఊరు. తాలూకా కూడాను.

అయితే అక్కడికి వెళ్లినవాళ్ళెవర్నూ ఉన్నది కాస్తా వదలించుకోకుండా రారు. తాయారమ్మ, నరిసిమయ్య కేసులు బనాయించుకున్నారు. త్వరగా విడివడాలన్నా, అది వాళ్ళచేతిలో లేదు.

డాక్టరుచేత పరీక్ష లేకుండా రెండు సర్టిఫికెట్లు చెరిఒకటి సృష్టించగలిగారు. పూ రిపోర్టు ముందు పైకిపంపాలంటే మూడని పోలీసు స్టేషనులో పేచీపడ్డారు. చెరి నలుగురు వకీళ్లను పెట్టుకున్నారు. మనకంతా విచిత్రంగా కనుపిస్తుంది. కాని పైసా మహాత్యం. రెండు డబ్బు లెక్కువగా ఉంటే కిందా, పైనా తెలియదు మనకి. గోళ్ళతో పోయే దాన్ని గొడ్డళ్ళదాకా తెచ్చుకుంటాం. వీలుగాఉంటే మీసం మెలివేస్తాం. లేకపోతే ఆకాశంకేసి చూస్తాం.

రెండు ఏనుగులు గింజుకుంటున్నాయి. వాటి కాళ్లక్రిందపడ్డ చీమలు చిటపట మనకుండా చిరంజీవులు కావాలని చేతులెత్తి ప్రార్థించుదాం.

## 3

రంగడు బాగా చదువుకున్న వాడు కాదు. స్కూలు ఫైనల్ వరకు వచ్చేసరికే దండయాత్రలవల్ల చాలా ఏండ్లు గడచిపోయాయి. అతని దృష్టి ఎప్పుడూ పొలాలమీదనే ఉండేది. పైరులమధ్య పోతూఉంటే అతని వళ్లు పులకరిస్తుంది. గట్లమీద కూర్చోవటం అతనికి సరదా. నూనూగుమీసం మెలివేస్తూ, యీల వేసుకుంటూ, పదాలు పాడుకుంటూ, కిర్రుచెప్పులు వేసుకొని, చుట్టపొగ సుళ్లుతిప్పుతూ...పొలాలవెంట పోయేవాడు. కడకు చదువుకి వివాహంతో స్వస్తి చెప్పాడు.

అతని జీవితం పెండ్లికాకముందు ఒకవిధంగాను, పెండ్లి అయినతరువాత మరోవిధంగాను ఉంది.

ఇప్పుడతడు ఏదో లోటుగా ఉన్నట్టు భావిస్తాడు.

తన తప్పు ఉన్నపళంగా తగలబడిపోవడంచేత అత్తగారంటే అరికాలిమంట నెత్తికెక్కుతుం దతనికి. ముఖ్యంగా వీరయ్యను కొట్టటంచేత అత్తగారిమీద ద్వేషం ప్రబలింది.

ఇరుపక్షాలవారికీ మొహంమీద బొప్పెలు కట్టాయి. ప్లీడర్ల ఫీజులు, కోర్టు రుసుములు, లంచాలు, లాంఛనాలు, యినాములు, సలాములతో గులాములయ్యారు. వదలవలసినంత వదలిపోయింది. ఇహ యిప్పుడు పరువుకు పాటుపడుతున్నారు. కాని యిప్పుడప్పుడే రాజీకి దిగే అవకాశాలు లేవు.

* * *

ఇవ్వాళ రంగడు పూర్తిగా మారిపోయాడు. అతనికి యింతవరకుఉన్న భావాలన్నీ చెల్లాచెదరయ్యాయి. గూడుకట్టుకున్న దురభిప్రాయాలన్నీ కూలిపోయాయి. ఊహలన్నీ పటాపంచలయ్యాయి. అతనికి రుద్రపురాన్నుంచి ఉత్తరం వచ్చింది. అదే అతనిలో పరివర్తన కలగడానికి కారణం.

గదిలో పడకకుర్చీలో పడుకొని ఉత్తరాన్ని విప్పి మళ్ళీ చదవటం మొదలుపెట్టాడు. అక్కడక్కడా కొన్ని పంక్తులు చదివాడు. అవి మధురస్మృతులమాటున మమతను లేపాయి.

"మీరు మొగవారు. ప్రపంచం మిమ్మల్ని ఏమీ అనదు. కాని నాగతి? మా అమ్మగారి, మీ నాన్నగారి దౌష్ట్యానికి మనం బలికావలసిందేనా? కాని నేనెవర్నీ నిందించదలచుకోలేదు. ఏనాడో ఏదో నేరంచేసి ఉంటాను. అందుకనే నాకీశిక్ష. ఏదో పాపంచేసి ఉంటాను. అందుకే నాకీ నరకం.

"వివాహితనైకూడా కన్యాత్వం అనుభవించవలసిందేనా? నాకీ సంఘపు దుష్టపు చూపులబారినుండి విముక్తి లేదా?

"నన్ను తీసుకొని వెళ్లండి. తరువాత మీ కక్షలు కొనసాగించండి. పతి యింట్లో చావడమే సతి కోరుకుంటుంది.

"నన్ను మీరూ తిరస్కరిస్తున్నారా? అయితే ఎవరికోసం యీ జీవితం? అందు


# ప్రియ సోదరీమణులకు

నేను నర్సునో, డాక్టరునో కాదు. మీవలె సామాన్యస్త్రీని. నాకు వివాహమైన తర్వాత నేను భయంకరమైన కుసుమవ్యాధికి గురి అయితిని. అకాల బహిష్టువల్ల బాధ, బలహీనత, నడుమునొప్పి, మూర్ఛ, తలనొప్పి ఏర్పడినది. నా భర్త వేలకొలది రూపాయలు ఖర్చుపెట్టి అనేక ఔషధములు యిప్పించిరి కాని ఫలితము కలుగలేదు. ఇలా మూడు సంవత్సరములు గడిచింది. అదృష్టవశాత్తు మా యింటికి వచ్చిన ఒక సన్యాసికి భిక్ష పెట్టునప్పుడు, ఆ మహాత్ముడు నన్నుచూచి "అమ్మాయి! నీకేమి వ్యాధి. ఈ వయస్సులో నీ ముఖము పాలిపోయినదే" అని ప్రశ్నించిరి. వెంటనే నా భర్త నా వ్యాధి పూర్తి వివరములు ఆ మహాత్మునికి తెలిపిరి. మహాత్ముడు ఒక మందును చెప్పిరి. ఆ మందు నా వ్యాధిని పూర్తిగా పోగొట్టింది. ఈశ్వరానుగ్రహంవల్ల నాకు యిప్పుడు చక్కని బిడ్డలు గలరు. ఈ మందును అనేక సోదరీమణులకు యిచ్చి వారి వ్యాధి నయం చేసినాను. ఇంకను అనేకులకు యిస్తున్నాను. "నారీ కల్యాణ్" నలభై ఆయుర్వేద ద్రవ్యములచే చేయబడినది. యీ మందును తయారుచేయుటకగు విలువకు మాత్రమే అమ్ముచున్నాను. దీనివల్ల నేనేమి లాభం పొందటంలేదు. పై వ్యాధిచే పీడింపబడు ఏ స్త్రీయైన నాకు వ్రాయండి. ఒక స్త్రీకి 15 రోజుల మందు తయారుచేయుటకు ఖర్చు రూ. 8/- పోసు ఖర్చు ప్రత్యేకము.

గమనిక: నేను పై వ్యాధికి మాత్రమే మందునివ్వగలను.

ఇతర వ్యాధులనుగూర్చి నాకు వ్రాయవద్దు గోరుచున్నాను

మీ పేరు, అడ్రసు యింగ్లీషులో వ్రాయండి.

*Wanted Stockists in all towns:*

**KAMALAVATI,**

**Above A-1 Resturant, 3rd Floor, Grant Road Bridge,**

**BOMBAY-7**

## ★ మధుపర్కం ★

కని దీనిని అంతం చేద్దామనుకుంటున్నాను.

"అమ్మ మా మేనమామగారింటికి సలహాల కోసం వెళ్ళింది. పున్నమి వెళితేగాని రాదు. అంతవరకు మీ దర్శనంకోసం ఎదురు చూస్తూఉంటాను. ఆతరువాత...

సెలవు.
మీ పాదదాసి,
పార్వతి."

ప్రతిమాటలోను హృదయావేదన ఉట్టి పడుతోంది. ప్రతిమాటా హృదయాన్ని దూసుకొని పోతోంది.

రంగడికి చిన్ననాటిమిత్రుడు విశ్వనాధం జ్ఞాపకం వచ్చాడు. అతని వేదవాక్కులు నెమరు వేశాడు. "ఒరేయ్ రంగా! ... ఒక



స్త్రీపతనానికి ఒకభర్త ఒకొకప్పుడు కారణమౌతాడు. అది అనేకవిధాల జరుగవచ్చు. అయితే ఆ పతన ఫలితం ఆ ఒక్క స్త్రీయే అనుభవించదు. కొంత భాగం భర్తకుకూడా వదిలేస్తుంది. ఎలాగంటావేమో? "ఫలాని వాడిభార్య" అని ప్రతివాడూ అంటాడా, అనడా? అప్పుడా ఫలానివాడి తల ఎక్కడ పెట్టుకోవాలి?"

కర్తవ్యం బోధపడక తల బద్దలు కొట్టుకున్నాడు రాత్రి అంతా ఆలోచిస్తూనే కూర్చున్నాడు. ఆలోచనలతో మెదడు పగిలిపోతోంది. "ఎందుకీ శిక్ష" - అంటూ పైమరిచి అరచాడు.

తెలతెలవారుతూండగా ఓ చిన్న కునుకు తీశాడు. పార్వతి కనబడింది రెండుకాళ్ళ మీదా పడింది:- "నాకన్యాయం చేయకండి ఈ పాదాలవద్ద నాకు స్థానముంది. ఆ స్థానం నాకివ్వండి. కాదనకండి." అంటూ ఫెడీలు, ఫెడీలుమని తలబాదుకుంటోంది. ఏ నిశ్చయానికి రాలేకపోయాడతను నిశ్చేష్టుడై నిలుచున్నాడు. కనీసం పార్వతిని లేవనెత్తుదామనికూడా అతనికి ఊహా కలుగలేదు. ఆకారంకేసి చూస్తూ నిలబడ్డాడు. ఇంతలో ఎవరో లేపారు. ఉలిక్కిపడి లేచాడు. అంతా కల...కల్ల.

"కలలోకూడా పార్వతి నాదరించలేకపోయాను -" అంటూ నిట్టూర్చి నిలబడ్డాడు.

తల్లితో అన్నాడు:—"అమ్మా!...నేరమొకచోట జరిగితే, శిక్ష మరొకచోట విధించటం న్యాయమేనా?"

తల్లి అన్నది:—"ఏమిట్రా?"

"అది కాదమ్మా!...నన్ను సరిగా అర్థం చేసుకో మేమేం పాపం చేశామని మా దాంపత్యాన్ని విడదీశారు ఆ దక్కడ. నే నిక్కడ. కానియ్యండమ్మా...మీ యిష్ట మొచ్చినట్లే జరుగనివ్వండి".అంటూ ఉద్రేకంతో వెళ్ళిపోయాడు. తల్లి కళ్ళనీళ్ళు చీరకొంగుతో తుడుచుకుంది

తండ్రి అంటే రంగడు గజగజ వణికిపోతాడు. అతని కక్కువ చనువు తల్లి దగ్గిర. వీరయ్యంటే అతని కభిమానం, గౌరవం కూడా వుంది. ప్రతి విషయంలో వీరయ్య సలహా తీసుకుంటాడు.

ఇదివరకు మాదిరిగా రంగ డేపనీ హుషారుగా, చురుగ్గా చేయుటంలేదు. వట్టి స్తబ్ధు మందకొడితనం, బద్ధకం, మతిమరపు... ఎన్ని ఉండాలో అన్నీ ఉన్నాయి. సంపూర్ణంగా మారిపోయాడు. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ ఉంటాడు. ఒకటికి నాలుగుసార్లు పిలిస్తే గాని జవాబివ్వడు. నిద్రాహారాల విషయంలో కూడా శ్రద్ధ తీసుకోవటం లేదు. విసుకు, చిరాకు, కోపం అతనిలో ప్రబలుతున్నాయి. ఇంటిల్లిపాది రంగడి నేదో ఆవేశించిందని అనుమానపడ్డారు.

సంధ్యాసమయంలో చెరువుగట్టుమీద కూర్చుని...కమలాలను, వాటిమీద వ్రాలే తేనెటీగలను తదేకంగా చూస్తూ కూర్చున్నాడు. కాని అతని కేమీ కనుపించటం లేదు. దృష్టంతా పార్వతిమీదికి పరిగెత్తుతోంది.

రానురాను అతని దృష్టిపథంలో అనేక సంఘటనలు దొర్లిపోయాయి. తన యింట్లో తనొక నౌకరు అంతకన్నా వేరే స్థానమున్నట్లుకనుపించదు. పగలల్లా గాడిదచాకిరీ చేస్తున్నాడు నౌకరు రాకపోతే నూతి నీళ్ళు తోడాలి, పాలు తియ్యాలి, పుల్లలు కొట్టాలి బర్రెలు విప్పాలి, ఆవులు తోలాలి, ఎడ్లు కాయాలి, నాగలి దున్నాలి. రోజూ ఏదో ఒకటి తనవంతుకు మిగులుతూనే ఉంటుంది. కాని తనకు ప్రతిఫలం తిట్లు, దీవెనలు. "నా కాలంలో నే నంత చేశాను. ఇంత చేశాను. ఈ కాస్తకే ఏడుస్తావేం"—అది తండ్రి అనే మాట. ఇలాంటి పనులు తనవాళ్ళంతా చేశారు. తనూ చేస్తానన్నాడు చేయాలి. కాని అప్పటి సరదా వేరు.

"ఏమిటాలోచిస్తున్నావు?..." వీరయ్య పిలిచాడు. ఇంతకు ముందు వీరయ్య యింటికి వెళుతూ వెళుతూ రంగణ్ణి రెండు కేకలు వేశాడు. "ప్రొద్దుపోతోంది. పోదాంరా" అని. కాని రంగడు సమాధానమివ్వలేదు. దగ్గరగా వచ్చాడు. తట్టి పిలచాడు

"ఏమీ లేదు." ముక్తసరిగా సమాధానం చెప్పాడు రంగడు. కాని ఏదో ఆవేదనతో కుమిలిపోతూన్నట్లు యిట్టే పసిగట్టాడు వీరయ్య వీరయ్య ఒకపట్టాన వదలే మనిషి కాదు. తనకున్న చనువువల్ల రంగణ్ణి గుచ్చి, గుచ్చి అడిగాడు రంగడికి చెప్పక తప్పిందికాదు వీరయ్య సానుభూతివాక్యాలతో ఇంతవరకు కప్పి వేయబడ్డ దుఃఖాగ్ని రగిలింది.

రంగడిలో యీ దుఃఖం ప్రజ్వరిల్లటానికి కారణం ఒక్క పార్వతివల్ల వేరుచేయబడినందువల్ల కాదు. ఇంతవరకు అతని హృదయం ఆవేదనాపూరితమై వున్నది. తన స్థానం ఏమిటో తనీనాడు విమర్శించుకుంటున్నాడు. ఈలాంటి అనునయవాక్యాలు ఇంతదాకా పల్కినవారు లేరు. ఆ విధమైన విషమపరిస్థితిలో అతనికి దుఃఖం ఆపుకున్నా ఆగిందికాదు.

## 4

శరత్కాల చంద్రుడు పండువెన్నెలలు విరజిమ్ముతున్నాడు. యౌవనంతో ఉప్పొంగే హృదయాలకు కితకితలు పెడుతున్నాడు. ఆరాత్రి చిరుచలిగా ఉంది. పక్కమీది తెల్లటి రెక్కగుప్పటి తీసి కప్పుకున్నాడు రంగడు. సైకిలెక్కాడు రుద్రపురానికి.

* * *

తన రెండుచేతులతో నున్నటి బుగ్గలు నిమురుతూ, దగ్గరకు తీసుకొని, పార్వతి కండ్లలోకి తదేకంగా చూస్తూ:—"పార్వతీ!..." అన్నాడు. అమితానందంతో పార్వతి సమాధానమివ్వలేదు. ముగ్ధత్వం, ప్రేమ, జాలి, ఆప్యాయతా ఆమెలో ఉట్టిపడుతున్నాయి వళ్ళు పులకరించింది. వెచ్చని ఊర్పులు విడిచారు. ఆనందాతిశయంతో పార్వతి కండ్లు చెమర్చినై బరువైన కనురెప్పలు వాలిపోతున్నాయి

ఇన్నాళ్ళనుంచి తనేదో అపూర్వవస్తువు నుండి వేరుచేయబడ్డట్లు రంగడు భావించాడు. పార్వతి పెదవులు చుంబించబోయాడు. సిగ్గు పెనవేసుకోవడంవల్ల తల వంచి, తనకు తెలియకుండానే రంగడి వడిలో వాలిపోయింది. ఒక మేఘశకలం సుధాకరుణ్ణి కప్పివేసింది.

## 5

తెల్లవారుఝామున కోడికూతకే పాలేళ్లను లేపి పనికోసం పొలానికి పంపించవలసిన బాధ్యత రంగడిమీద ఉన్నది అందర్నీ మేల్కొలిపి పంపాడు. మనిషి బాగా అలసిపోయి ఉన్నాడు. నిద్ర వరదలాగ ముంచుకొనిరా మొదలిడింది. అడ్డుపెట్టటం శక్తికిమించిన పనిగా పరిణమించింది

పట్టె గడ్డివాము ప్రక్కనే ఉంది. లోపల దూరి రెక్కదుప్పటి కప్పుకొని నిద్రకుపడ్డాడు. బయట పాలేళ్లు కళ్ళం వేస్తున్నారు.

నర్సిమయ్య ప్రొద్దుటే పొలానికి వచ్చాడు. కొడుకెక్కడా కనుపించలేదు. వీరయ్యనడిగాడు. వీరయ్య రంగడి ఉనికి చెప్పాడు. తెల్లవారుఝామునే లేవటంవల్ల నిద్దురచాలక పడుకున్నాడేమోనని తలచాడు

ప్రొద్దు బాగా ఎక్కింది అన్నపువేళయింది. కొడుకును నిద్రలేపి అన్నానికి పంపుదామని నిశ్చయించాడు. చూస్తే పట్టె గడ్డి అంతా మీదవేసుకొని గుర్రు కొడుతున్నాడు. పైగడ్డి తప్పించాడు చీర అంచు బయటపడింది ఎక్కడిదో చీర కప్పుకొని

# ★ మధుపర్కం ★

రంగడు పడుకున్నాడు. నర్సిమయ్య కొడుకు వర్తనాన్ని శంకించాడు. అతని మెదడు తీవ్రంగా పనిచేయటం మొదలు పెట్టింది. ఆవులిస్తే పేగులు లెక్కబెట్టే రకం. ఎంతో సేపటికిగాని అసలు విషయం గుర్తుపట్టలేకపోయాడు. "ఆ చీర ..ఆ తెల్ల చీర...ఎక్కడిది? నిజం...అదే కావాలి అదే. ఆనాడు పెండ్లిపీటలమీద పార్వతి మధుపర్కం అవును" క్షణంలో విషయమంతా బట్టబయలయింది. నర్సిమయ్య ఉద్రేకంతో ఊగిపోయాడు. తన వ్యక్తిత్వాన్ని, గౌరవాన్ని దుమ్ముధూళిలో కలిపాడు కొడుకు. ఎముకలు విరగ్గొడదామనుకున్నాడు. కర్ర ఎత్తాడు.

*   *   *

రుద్రపురాన్నుంచి తిరిగి వచ్చేటప్పుడు పొరపాటున రంగడు తన దుప్పటి అక్కడ మరచిపోయి, మడతలో ఉన్న భార్య మధుపర్కం కాస్తా పట్టుకొవచ్చాడు.

ఎలాగయితేనేం విషయం తండ్రికి తెలిసింది. ఒక్కసారి హుంకరించాడు. "దరిద్ర వెధవ!...మొగుడు కావాలని దానికి లేదు గాని...పెండ్లాం...పెండ్లాం... అంటూ అరచి చస్తున్నాడు."

రంగడందుకున్నాడు. "నీకేం తెలుసేమిటి? నోటికి వచ్చినట్లు మాట్లాడగానే సరి పోయిందా?"—

"నోర్ముయ్?" - దవడ ఊడేటట్టు కొట్టాడు తండ్రి. "సమాధానంకూడా చెబుతున్నాడు వెధవ."

రంగడు మౌనంగా వెళ్ళిపోయాడు. భార్య అందుకుంది "అయిందేదో అయిపోయింది. వాడిల్లా ఎన్నిరోజులనుండి ఇలాయిన్ని మైళ్ళు వెళ్ళివస్తున్నాడో? ఇలానే అయితే వాడి ఆరోగ్యం కాస్తా పాడై కూర్చుంటుంది."

"చస్తాడంటావు" ఉరిమాడు నర్సిమయ్య.

"అలా అనకండి. అశుభం కోరుకో కూడదు. పిల్లను తెచ్చుకుందాం. ఆ తరువాత మన కష్టాలు, మనం ఉండనే ఉన్నాం."

"వీల్లేదు" చిందులు త్రొక్కాడు నర్సిమయ్య.

"ఇన్నిరోజులనుంచి వాడి సంగతి మీరేం గమనిస్తున్నారు? మనిషి పూర్తిగా మారిపోయాడు. నామాట వినండి గోళ్లతో పోయేదాన్ని గొడ్డళ్ళవరకు తేకండి"

ఆరోజల్లా కొడుకునుగురించి నర్సిమయ్య ఆలోచించాడు.

ఆరోజల్లా ఇంట్లో వంట పొయ్యిమీదికి ఎక్కలేదు.

ఆరోజల్లా రంగడింటికి రాలేదు.

తెల్లవారి పొలంలో రంగడితో వీరయ్య చెప్పాడు "కోడలిని తీసుకొని రావటానికి నిశ్చయించుకున్నారు. ఆ తరువాత మీ అత్తగారి చిన్న పేగులు త్రెంగేస్తారట."

"నిజంగా? -" ఆశ్చర్యంతో రంగడన్నాడు.

"అవును. అబద్ధమెందుకు చెబుతాను. రేపు చూడరాదా అని. అప్పుడే చాకలాళ్లు కూడా వెళ్ళిపోయారు." ★



విద్యుద్గర్భ

శివసముద్రం దృశ్యం.

—ఫొటో: విఠల్ ప్రసాద్, మద్రాసు.